క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ హయాంలోనే డివిజన్ అభివృద్ధి



ఆటోనగర్(విజయవాడతూర్పు): డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ గురువారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. 15వ డివిజన్ కాలువగట్టు ప్రాంతంలో గడప గడపకి మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ రామలింగేశ్వరనగర్ కాలువగట్టు ప్రాంతంలో సుమారు 1000 గడపలు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు గాను రూ.1.50 కోట్లతో పైపులైన్ వేశామన్నారు. 15వ డివిజన్‌లో ఇప్పటికే 95 శాతం పైగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. రూ.33 కోట్లతో డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇంటింటికి ఆమె వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, వివిరెడ్డి, మురళి, నిమ్మల కృష్ణ, డీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు సిద్ధార్థ ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు ఫీల్డ్ విజిట్ చేపడుతున్నారు. అందులో భాగంగా నగరంలోని ఏబీజే కాలనీలో గురువారం ఆరోగ్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ప్రథమ చికిత్స, వడదెబ్బ, రుతుస్రావం, పోషకాహార లోపాలు వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జె సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న నేతృత్వంలోనే నగరాభివృద్ధి



పటమట(విజయవాడ తూర్పు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోనే విజయవాడ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో వాకర్స్, క్రీడాకారులు, యోగ సభ్యులతో అవినాష్ గురువారం బేటీ అయ్యారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో 24 గంటల పీహెచ్‌సీలు పనితీరును తెలుసుకునేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం రాత్రి మూడు పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, సేవలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాత్రి 10.10 గంటల సమయంలో పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉండాల్సిన సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అటెండెన్స్ రిజిస్టర్ చూశారు. అనంతరం రాత్రి 10.50 గంటలకు ఏ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇడీడీ క్యాలెండర్, డెలివరీ రూమ్ సౌకర్యాలు, మందులు అందుబాటు వంటి వాటిని పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటలకు జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రసూతి సేవలను 24 గంటలు అందుబాటులో ఉండాలని, అందుకు అనుగుణంగా విధులకు హాజరు కావాలని సూచించారు. తమ తనిఖీల్లో గైర్హాజరు అయినట్లు గుర్తిస్తే షోకాజ్ నోటీసుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

- యూపీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు
- విజయవాడలో 43 యూపీహెచ్‌సీలు
- తూర్పులో 13 ఆస్పత్రులు
- వాటిలో మూడింటికి కొత్త భవనాలు
- 63 రకాల పరీక్షలు నిర్వహిస్తున్న వైనం
- ప్రతిరోజూ 60 నుంచి 150 మందికి వైద్య పరీక్షలు



లబ్బీపేట ఆరోగ్య కేంద్రంలో ఆధునిక పరికరాలతో పరీక్షలు చేస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలకు దీటుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి యూపీహెచ్‌సీకి అధునాతన పరికరాలు సమకూర్చడంతో పాటు, నిపుణులైన సిబ్బందిని నియమించడంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా అన్ని పరీక్షలు ఇంటి సమీపంలోనే చేస్తున్నారు. ఒకప్పుడు విజయవాడలో 22 యూపీహెచ్‌సీలు ఉండగా, ఇప్పుడు ప్రతి 25 వేల మంది జనాభాకు ఒకటి చొప్పున 41 ఏర్పాటు చేశారు. దీంతో పట్టణ పేదలు వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పెద్దాస్పత్రులకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా, తాము నివశించే ఇంటి సమీపంలోని ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. అక్కడ అన్ని రకాల పరీక్షలు చేయడంతో పాటు, మందులు సైతం ఉచితంగా అందజేస్తున్నారు. అంతేకాదు ప్రసవాలు సైతం చేసే స్థాయిగా చేరుకున్నారు. గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసేందుకు మెషిన్‌లు, గైనకాలజిస్టులను కూడా అందుబాటులోకి తెచ్చారు. యూపీహెచ్‌సీలో 63 రకాల పరీక్షలు, 182 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి.

అన్ని రకాల సదుపాయాలు

విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 13 వైఎస్సార్ యూపీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. భ్రమరాంబపురం, కృష్ణలంక, రాణిగారితోట, బాలాజీనగర్, రామలింగేశ్వరనగర్, లబ్బీపేట, పటమట అంబేడ్కర్‌కాలనీ, పటమటలంక, ఏపీఐఐసీ కాలనీ, క్రీస్తురాజుపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, కార్మికనగర్, గులాంమెహిద్దీన్‌నగర్‌లలో సేవలు అందిస్తున్నాయి. వాటిలో భ్రమరాంబపురం, గుణదల గంగిరెద్దుల దిబ్బ, ఏపీఐఐసీ కాలనీల్లో ఒక్కో సెంటర్‌కు రూ. కోటిన్నర వ్యయంతో నూతన భవనాలు నిర్మాణం చేపట్టారు. వాటిలో డాక్టర్స్ రూమ్‌లు, పది పడకలతో వార్డు, ల్యాబొరేటరీ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి యూపీహెచ్‌సీలో వైద్యుడు, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ఒక ఫార్మసిస్టు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ వర్కర్ విధులు నిర్వహిస్తున్నారు.

63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు, 182 రకాల మందులు అందుబాటులో ఉంచుతున్నారు. అక్కడ సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, ఎలక్ట్రాలసిస్ వంటి పరీక్షలను అత్యాధునిక పరికరాలపై చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం అత్యాధునిక పరికరాలను సమకూర్చడంతో పాటు, వాటిపై పరీక్షలు చేసేందుకు అనుభవజ్ఞులైన ప్రొఫెసర్‌లతో ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఇప్పించారు. దీంతో గర్భిణులు, బాలింతలు, రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నారు.

ప్రతి రోగికీ ఎలక్ట్రానిక్ ఐడీ

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లిన ప్రతి రోగికి ఎలక్ట్రానిక్ ఐడీ క్రియేట్ చేస్తారు. ఆధార్ నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా క్రియేట్ చేసే ఐడీలో వారి ఆరోగ్య వివరాలు, పరీక్షా ఫలితాలను కూడా నమోదు చేయడంతో, వారు ఎప్పుడు ఆస్పత్రికి వచ్చినా గతంలో పొందిన చికిత్స వివరాలు, వ్యాధులు అందులో చూసి తెలుసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆధునిక సేవలు అందిస్తుండటంతో యూపీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఒక్కో యూపీహెచ్‌సీకి 60 నుంచి 150 మంది రోగులు వస్తున్నారు.

ఆరోగ్య కేంద్రాల రూపు రేఖలు మారాయి



నగరంలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో అరకొర సౌకర్యాలతో నిర్వహించిన ఆరోగ్య కేంద్రాల రూపు రేఖలు మారిపోయాయి. ఏపీఐఐసీ కాలనీలో నిర్మించిన యూపీహెచ్‌సీలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు సౌకర్యాలు కల్పించారు.

– గల్లా పద్మావతి, ఇన్‌ఛార్జి, 4వ డివిజన్

అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం



ప్రస్తుతం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వర నిర్ధారణ పరీక్షలతో పాటు, లిపిడ్ ప్రొఫైల్, సిరమ్ క్రియాటిక్, లివర్ ఫంక్షన్ టెస్ట్, సీబీపీ వంటి పరీక్షలు చేస్తున్నాం. ప్రజలు సైతం సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. రోగుల సంఖ్య కూడా పెరిగింది.

– టి.విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి, ఏపీ స్టేట్ గవర్నమెంటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

సంక్షేమాభివృద్ధితో సంతోషంగా ప్రజలు



సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్



చిరువ్యాపారులకు బండ్లను అందజేస్తున్న దేవినేని అవినాష్

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, మళ్లీ జగనన్న సీఎం కావాలని కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లో కంచెర్ల కోటయ్య వీధి, తారకరామనగర్ కరకట్ట ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 58 నెలల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి 2024 వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అంటేనే ప్రజలకు జగనన్న గుర్తుకొస్తున్నారని చెప్పారు. కృష్ణలంక ప్రాంత వాసుల ఇళ్ల పట్టాల సమస్య తీర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేయటమే పనిగా పెట్టుకున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఓటమి భయంతోనే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తూర్పులో గద్దె పని అయిపోయిందని, తనపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓడిపోతాననే భయంతో పచ్చ పత్రికలను అడ్డుపెట్టుకుని అసత్య ప్రచారాలకు తెరలేపారని మండిపడ్డారు. నీచ రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్‌లు టీడీపీ నేతలని అన్నారు. గీతాంజలి పొందిన లబ్ధిపై సంతోషం వ్యక్తం చేస్తే చూసి తట్టుకోలేక ట్రోలింగులు, పోస్టింగులు పెట్టి ఆమె మృతికి టీడీపీ నేతలు కారకులయ్యారని తెలిపారు. తలకిందులుగా తపస్సు చేసిన నారా లోకేష్ జీవితంలో ఎమ్మెల్యే కాలేడని చెప్పారు. రాష్ట్రంలోని కాపు నేతలు సైతం పవన్‌కల్యాణ్‌ను చీదరించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఉచితంగా బండ్లు పంపిణీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజకీయాలకు అతీతంగా విద్య, ఉపాధి, వైద్య సహాయం అవసరమైన ప్రతి ఒక్కరికీ దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విస్తతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లో డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో నాలుగు నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం ట్రస్ట్ ద్వారా ఉచితంగా నాలుగు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ డివిజన్‌కు చెందిన నలుగురు చిరువ్యాపారులు అద్దె బండ్లతో ఇబ్బందులు పడుతున్నామని, తమకు జీవనోపాధి నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని కోరారని తెలిపారు. వెంటనే ట్రస్ట్ ద్వారా ఆ నలుగురికి రూ.లక్ష విలువైన మూడు తోపుడు బండ్లు, ఒక టిఫిన్ బండిని అందజేశామన్నారు. బండ్లను వినియోగించుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో అవినాష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ ఇఫ్తార్ విందులు నిలుస్తాయని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఆయన గురువారం లబ్బీపేట పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొని ముస్లింలతో కలిసి గంజి సేవించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముస్లింలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను కోరుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం, ప్రత్యేకంగా ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అల్లాహ్ ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ రిజ్వాన్, నాయకులు నాహీద్, ఎస్‌కే సుభానీ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక గుండారపు సోమయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బందికి నూతన వస్త్రాల బహూకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా పేద వ్యక్తులకు ఇస్త్రీ బండి, రెండు టిఫిన్ బండ్లు అందచేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ తన తండ్రి సోమయ్య పేరుతో ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది శానిటరీ సిబ్బందికి కొత్త దుస్తులు అందిస్తున్నామని తెలిపారు.

ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీ ఎస్పీఎఫ్) విజయవాడ యూనిట్ అధికారులు, సిబ్బందికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ వద్ద కార్యాలయంలో ఏపీఎస్పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ, ఐజి రామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఈ వైద్య శిబిరం నిర్వహించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్యులు పాల్గొని 245 మంది సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్పీఎఫ్ కమాండెంట్ ఎం.శంకర్‌రావు మాట్లాడుతూ సిబ్బందికి కంటి సమస్యలు ఉంటే తెలుసుకుని వైద్య పరీక్షలు చేయించాలనే ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. విజయవాడ యూనిట్ అసిస్టెంట్ కమాండ్ పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. అలాగే పరీక్షలు నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు, ఎస్ఐ ఫణి కుమార్, ఏఎస్ఐ భాను ప్రకాష్ రెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి వినికిడి యంత్రం అందజేత



వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న యలమంచిలి జయప్రకాష్, ట్రస్ట్ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సహాయం అవసరమైన వారికి చేయడంలోనే నిజమైన ఆనందంగా ఉంటుందని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జ్ యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. గిరిపురంలో నివాసం ఉంటున్న కంభంపాటి కిషోర్ కుమార్తె యశ్విత (15) పదో తరగతి విద్యార్థినికి రూ.18 వేలు విలువ గల వినికిడి యంత్రాన్ని వైఎన్నార్ చారిటీస్ ద్వారా కొనుగోలు చేసి యశ్వితకు సంజీవని ఆసుపత్రి ఆవరణలో గురువారం ఉచితంగా అందచేశారు. సంజీవని ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ చింతల వెంకటరాజేష్, చావా రఘు, శివతో పాటుగా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. యలమంచిలి జయప్రకాష్ మాట్లాడుతూ తరగతి గదిలో పాఠాలు వినే సమయంలో యశ్విత చాలా ఇబ్బంది పడుతుందని కుటుంబసభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించి ఆమెకు అవసరమైన వినికిడి యంత్రాన్ని తమ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందచేస్తున్నామన్నారు. సహాయం అవసరమైన వారికి అందించడంతో తమ ట్రస్ట్, వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ ముందుంటుదన్నారు.

ప్రజలను రెచ్చగొట్టేందుకే పౌరసత్వ బిల్లు

మైనార్టీ నాయకుడు, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీమ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలను రెచ్చగొట్టడానికి ఎన్నికల ముందు పౌరసత్వ చట్టసవరణ బిల్లును తెరమీద తీసుకొచ్చారని వీఎంసీ కో ఆప్షన్ మెంబర్, మైనార్టీ నాయకుడు సయ్యద్ అలీమ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు సామరస్యంగా కులమతాలకు అతీతంగా జీవిస్తున్న దేశంలో ఇలాంటి చట్టం తీసుకురావటం సరికాదని తెలిపారు. ఇది హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. పార్లమెంట్‌న ఆమోదించి నాలుగేళ్లకు నోటిపై ఇవ్వటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చాలని గాడ్సే సిద్ధాంతాన్ని అమలు చేయడానికి ఈ నోటిఫికేషన్ వచ్చిందని ధ్వజమెత్తారు. బీజేపీ మతోన్మాత విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ నిరసించాలని కోరారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



విద్యార్థినులకు క్రీడా పరికరాలు అందిస్తున్న బీఐఎస్ అధికారులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు, యువత వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవాలని మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ బ్రాంచి అసిస్టెంట్ డైరెక్టర్ దరూర్ అఖిల్ అన్నారు. ప్రపంచ వినయోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పటమటలోని కోనూరు బసవపున్నయ్య జిల్లా పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు మనక్ మహోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా సురక్షితమైన నాణ్యమైన వస్తువులను అందించడం, ఎగుమతులు, దిగుమతుల ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, హాల్ మార్కింగ్ స్టాండరైజేషన్, సర్టిఫికేషన్ టెస్టింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దరూర్ అఖిల్ ప్రమాణాల ప్రాముఖ్యత గురించి యువతకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయా అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు అల్ట్రాటెక్ సిమెంట్స్, ఏబీజీ గ్రూప్స్ నుంచి వివిధ క్రీడా వస్తువులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిమెంట్స్ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ జయదీప్, సీతారెడ్డి, రవికుమార్, పి చిట్టిబాబు, జయదీప్, అశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఆర్ సెంటర్ ప్రారంభానికి సిద్ధం చేయండి

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దిన త్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్‌ను అతి త్వరలో ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వ్యర్థ నిర్వహణలో ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తూ జ్ఞానాన్ని పెంచేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లోగల నిర్మిస్తున్న త్రిబుల్ ఆర్ సెంటర్‌ను ఆయన గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో నిర్మిస్తున్న త్రిబుల్ ఆర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. నగరానికి మరింత మెరుగులు దిద్దటమే కాకుండా నగర ప్రజల్లో వ్యర్థ నిర్వహణ గురించి అవగాహన కల్పించే త్రీడీ సూక్ష్మ నమూనాలు, అవి పని చేసే విధానాన్ని ఈ సెంటర్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నగరంలోని వ్యర్థాలను సేకరించి ఇక్కడ డంప్ చేసే ప్రాంతమైనప్పటికీ ఎంతో సుందరంగా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించటంతోపాటు కాలుష్యాన్ని తగ్గించే అందమైన మొక్కలను నాటి ప్రజలను ఆకట్టుకునే విధంగా త్రిబుల్ ఆర్ సెంటర్‌ను తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయనతోపాటు అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పార్క్స్) ఎఎస్ఎన్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై చైర్మన్ సమీక్ష



మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అభివృద్ధి పనులపై చైర్మన్ కర్నాటి రాంబాబు ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమీక్షించారు. మహా మండపం 7వ అంతస్తులోని చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయం తుది పనులు, యాగశాల, పూజా మండపాల పనులతో పాటు లడ్డూ, అన్నదానం, క్యూలైన్ల పనుల గురించి చర్చించారు. పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించడంతో పాటు దసరా నాటికి పూర్తి చేసేలా చూడాలని కోరారు. సమావేశంలో ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రోడ్డుపై నడుచుకుంటూ పనికి వెళ్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికురాలిని గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గవర్నమెంట్ ప్రెస్ సమీపంలోని ముత్యాలంపాడుకు చెందిన శ్రీల నాగదుర్గా కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తుంది. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పనికి వెళ్లేందుకు బుడమేరు మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ బైక్ బలంగా ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె తలకు, ఎడమ చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోను చేసి ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.